క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా విద్యుత్ లైన్ల మార్పిడి కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బస్టాండ్ నుంచి కోతిబొమ్మ సెంటర్ వరకు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రహదారుల మరమ్మతులకు దాత సహకారం



కొండిపర్రు(పామర్రు): మండలంలోని కొండిపర్రు గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలకు వెళ్లే రహదారులు గోతులమయంగా మారడంతో స్థానికుడు అల్లాడ శ్రీనివాసరావు శనివారం 150 టన్నుల డస్ట్‌ను సొంత నిధులతో కొనుగోలు చేశారు. దీనిని అధ్వానంగా మారిన రహదారుల్లో పోసి గోతులను పూడ్చించారు. దీంతతో స్థానికులు దాతకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానికులు నూకరపు వీరాంజనేయులు, పసుపులేటి విజయ్‌కుమార్, రావూరి శివయ్య, మదంశెట్టి సత్యనారాయణ, అల్లాడ నాగ మల్లేశ్వరరావు, ఏకుల చిరంజీవి, సువర్ణ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఉమ్మడి కృష్ణా జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సేవా సంస్థ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా అధ్యక్షురాలిగా దండమూడి జయలక్ష్మి, కార్యదర్శిగా శీతాల ప్రసాదు, కోశాధికారిగా జేవీవీ.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా సి.బి.జి.బాబు, సహాయ కార్యదర్శిగా ఎం.నాగవీరభద్రశాస్త్రి, కార్యవర్గ సభ్యులుగా బి.అనురాధ, జి.శ్యామ్, జి.సత్యనారాయణ, ఎం.బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గ సభ్యులను పూర్వ అధ్యక్షుడు పి.వి.శేషగిరిరావు, డైరెక్టర్ దండమూడి సీతారామ స్వామి, సభ్యులు జి.సుభాష్ చంద్ర బోస్, సురేంద్రబాబు, నవీన్ అభినందించారు.

ఎడతెరపి లేని వర్షంతో అవస్థలు



మండవల్లి: ఎడతెరపి లేని వర్షం కారణంగా ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజుల నుంచి ప్రతి రోజూ వర్షం పడుతుండటంతో రహదారులపై వర్షం నీరు నిలిచిపోతోంది. దీంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. మండవల్లి జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శాకంబరిగా దుర్గమ్మ



మండవల్లి: స్థానిక నాగ సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శనివారం అమ్మవారిని కూరగాయలతో శాకంబరిదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చాగంటి శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం కూరగాయలను భక్తులందరికీ పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

పెదపారుపూడి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అప్రమత్తం చేయాలని తహసీల్దార్ మాధవరావు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల తీవ్రత ఎక్కువగా ఉంటే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వర్షాలతో ఇళ్లు పడిపోయినా, దెబ్బతిన్నా తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు.

వెదజల్లే పద్ధతికే ప్రాధాన్యం

పామర్రు: మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్ల ప్రక్రియ ప్రారంభమైంది. రైతులు వెదజల్లే పద్ధతికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వరి నాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని రైతులకు వ్యవసాయ అధికారులు సూచించారు. దీనికి అనుగుణంగా కాలువలకు సాగు నీరు వదిలారు. నైరుతి రుతుపవనాలు కూడా సహకరించడంతో రైతులు నారుమళ్ల ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. కాలువల కింద సాగు చేసే రైతులు సంప్రదాయ పద్ధతిలో వరి నాట్లు వేసేందుకు నారుమడులు వేసుకున్నారు. మరికొంత మంది వెదజల్లు సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో 23,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వర్షాలు కురవక ముందే రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. ముందుగా వేసిన నారుమళ్లు ఏపుగా పెరిగాయని రైతులు పేర్కొన్నారు. నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మళ్లలో నీరు నిలబడడంతో కాలువల్లోకి కూడా నీటిని మళ్లించి రైతులు దమ్ములు చేయించుకుంటున్నారు. పామర్రు, కనుమూరు, కురుమద్దాలి, ఉరుటూరు, పెదమద్దాలి, జమీగొల్వేపల్లి, అడ్డాడ, కొండిపర్రు తదితర గ్రామాల్లో వరినాట్లు ప్రారంభమయ్యాయి. కూలీ రేట్లు కూడా గతేడాది కంటే పెరిగాయని రైతులు తెలిపారు. మగ వారికి రూ.600 నుంచి రూ.800, మహిళా కూలీలకు రూ.400 నుంచి రూ.500 వంతున తీసుకుంటున్నట్లు రైతులు పేర్కొన్నారు.

వెదజల్లు సాగుకు మొగ్గు

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వెదజల్లు వరి సాగుకు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది పంటను గతంలో కంటే 10 రోజులు ఆలస్యంగా నారుమళ్లు వేయడం ప్రారంభించారు. దీంతో వెదజల్లు సాగు పద్ధతి అనుసరిస్తే సమయం కలిసి వస్తుందని కొంత మంది రైతులు నారుమళ్లు వేసుకోలేదు. నారుమళ్లు వేసుకోని రైతులు వేదజల్లు సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ ఏడాది 60 శాతం మంది రైతులు వెదజల్లు పద్ధతికే మొగ్గు చూపుతున్నారు. రాపర్ల, జమీదగ్గుమిల్లి, పోలవరం, ఉండ్రపూడి తదితర గ్రామాల్లో రైతులు పంట పొలాలను దమ్ము చేస్తున్నారు. వెదజల్లులో కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పామర్రు ఏడీఏ స్వర్ణలత, ఏఓ శివనాగరాణి తెలిపారు.



వెదజల్లే సాగుకు సిద్ధం చేసిన పొలం



పొలంలో నాట్లు వేస్తున్న కూలీలు

వరి నాట్లకు పెట్టుబడి ఎక్కువ



పల్లపు భూములు కావడంతో వరి నారు పెంచి నాట్లు వేస్తున్నాం. వరినాట్లు వేసి సాగు చేయడం వల్ల పెట్టుబడులు పెరుగుతున్నాయి. పల్లపు భూములు వర్షాలకు మునిగిపోతాయని, సాగు ఖర్చు పెరిగినా తప్పని పరిస్థితుల్లో వరి నాట్లు పద్ధతి అనుసరించాం.

– ఎం.అంజిరెడ్డి, రైతు, పామర్రు

వెద సాగులో ఖర్చు తక్కువ



వెదజల్లు సాగులో పెట్టుబడులు ఆదా అవుతున్నాయి. వరినారు పెంచడం, ఆకు తీత, ఊడ్పులకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. వర్షాకాలంలో ముంపు బెడద ఉన్నా వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తున్నాం. సాగు ఖర్చు తగ్గించేందుకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు కలుపు నివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నాం.

– కేఎస్‌ఆర్.దాసు, రైతు, దగ్గుమిల్లి

అర్హులకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలి

పామర్రు: పామర్రు పంచాయతీ పరిధిలో అర్హులైన వారికి వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా కలెక్టర్ డీకే బాలాజీని కోరారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఎమ్మెల్యే శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పామర్రు నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్‌తో చర్చించారు. డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులకు మెట్లు ఏర్పాటుకు సహకరించాలన్నారు. చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు కిటికీలు, తలుపులు లేక చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీటిని ఏర్పాటు చేయాలని కోరారు. నిమ్మకూరు గురుకుల కళాశాల బాలికల వసతి గృహంలో మరుగుదొడ్ల మరమ్మతులు చేయించాలని, తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ విషయాలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతిపత్రం సమర్పించారు.



జిల్లా కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ప్రజలకు తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు

పెదపారుపూడి: పెరుగుతున్న ధరల నియంత్రణలో భాగంగా వినియోగదారులకు ప్రభుత్వం తక్కువ ధరకే అందించనున్నట్లు తహసీల్దార్ కేవీ మాధవరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం దేశవాళీ కందిపప్పు రూ.160 చొప్పున, నాణ్యమైన స్టీమ్ బియ్యం రకం బీపీటీ, సోనామసూరి రకం కేజీ రూ.49 చొప్పున, రా బియ్యం రూ.48కు అందించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు, బియ్యం కొనుగోలు విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు ప్రసాద్, దానియేలు, శ్రీనివాసరావు, భగవంతరావు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయ సమస్యలు పరిష్కరించాలి

గుడివాడ టౌన్: టిడ్కో కాలనీలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టిడ్కో ఈఈ, కాంట్రాక్టర్, ఇతర అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేకించి కాలనీలోని తాగునీటి సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్ పొంతనలేని సమాధానం చెప్పడాన్ని తప్పుపట్టారు. వీటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టిడ్కో ఎస్ఈ బి.చిన్నోడు, డీఈ శాంతకుమార్, ఏఈ సురేష్‌బాబు పాల్గొన్నారు.

వాణిజ్య భవనాలు ఖాళీ చేయాలి

పురపాలక సంఘ పరిధిలోని మహాత్మాగాంధీ, ఎస్పీఎస్ మున్సిపల్ కాంప్లెక్స్‌లకు చెందిన షాపులు శిథిలావస్థకు చేరినందున తొలగిస్తామని, వాటిని ఖాళీ చేయాలని ఎమ్మెల్యే రాము అన్నారు. శనివారం షాపు యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. తొలగించిన ఆరు నెలల్లో నూతన షాపులు నిర్మించి, ప్రస్తుతం వ్యాపారాలు చేసుకుంటున్న యజమానులకే తిరిగి కేటాయిస్తామన్నారు.



టిడ్కో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

అర్బన్ బ్యాంక్ ఇన్‌చార్జిగా విజయ్‌కుమార్



గుడివాడ టౌన్: ది గుడివాడ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా డి.విజయ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సహకార శాఖ మచిలీపట్నం డివిజినల్ కో–ఆపరేటివ్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేయుచున్న విజయ్‌కుమార్‌ను పర్సన్ ఇన్‌చార్జిగా నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోనే ప్రతిష్టాత్మకమైన సహకార బ్యాంకుగా సేవలందిస్తున్న గుడివాడ బ్యాంక్ బాధ్యతలను ప్రభుత్వం ఎంతో నమ్మకంగా తనకు అప్పగించిందన్నారు. పెద్ద మొత్తంలో ఖాతాదారులు డిపాజిట్లు ఉన్న ఈ బ్యాంక్‌లో రుణాల వసూళ్ల విషయంలో ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై తాను బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడతాం



గుడివాడ టౌన్: జాతీయ స్థాయి గుర్తింపు పొందిన నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) కార్మికుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేస్తుందని ఎన్ఎంయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, వైస్ ప్రెసిడెంట్ ఆర్.సుబ్బారావు, శ్రీనివాసరాజు పేర్కొన్నారు. స్థానిక వాసవి చౌక్‌లోని ఆర్యవైశ్య వేదికలో శనివారం ఎన్ఎంయూలోకి కొత్త సభ్యుల చేరిక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న కార్మిక సంస్థ ఎన్ఎంయూ అన్నారు. ఉద్యోగుల ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకుందాం అని వారు హితవు పలికారు. నూతనంగా ఎన్ఎంయూలో చేరిన కార్మికులకు వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి మదన్ మోహన్ పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాలు

ముదినేపల్లి రూరల్: మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో వరిచేలు ముంపునకు గురయ్యాయి. మండలంలో 15 వేల ఎకరాల వరకు సార్వా వరి సాగు చేస్తున్నారు. ఇందులో 10 వేల ఎకరాలకు పైగా నేరుగా విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఆలస్యంగా పంటకోతకు వచ్చే ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలను 20 రోజుల ముందే వెదజల్లారు. ముందుగా కోతకు వచ్చే స్వర్ణ రకం వరి విత్తనాలను 10 రోజుల కిందట వెదజల్లారు. ప్రస్తుతం 1318 రకం పైరు ఏపుగా పెరుగుతుండగా స్వర్ణరకం మొక్కపైన ఉన్నాయి. ఈ రకాల వరి చేలన్నీ పలు గ్రామాల్లో ముంపు బారిన పడ్డాయి. ఇప్పటివరకు కురిసిన వర్షాల వల్ల 1318 రకం వరిపైరుకు ఎలాంటి నష్టం వాటిల్లదని రైతులు చెబుతున్నారు. ఇకముందు మరిన్ని వర్షాలు కురిస్తే నష్టం వాటిల్లే ప్రమాదముందని పేర్కొంటున్నారు. స్వర్ణరకం వరిపైరు ప్రాథమిక దశలో ఉన్న పైరు పూర్తిగా నీట మునిగింది. ముదినేపల్లి, సింగరాయాపాలెం, పెదకామనపూడి, ఊటుకూరు, వాడవల్లి తదితర గ్రామాల్లో పైర్లు నీట మునిగాయి. మీడియం, మైనర్ డ్రెయిన్లు సక్రమంగా ప్రవహించకపోవడంతో పొలాల్లోని ముంపు నీరు బయటకుపోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు కురిసిన వర్షాల వల్ల పెద్దగా నష్టం లేకపోయినప్పటికీ ఇకముందు వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముదినేపల్లి శివారు అన్నవరంలో నీట మునిగిన వెదజల్లిన వరిచేలు

ముంపు నివారణ చర్యలు చేపట్టాలి

వర్షాల వల్ల ముంపు బారిన పడ్డ వరి పైర్లను కాపాడుకునేందుకు రైతులు తక్షణమే చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలకు నారుమడిలో విత్తనాలు జల్లిన రెండు, మూడు రోజుల వయస్సులో మూడు రోజులు కన్నా ఎక్కువగా నీట మునిగితే మొలక సైతం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. విత్తిన ఏడు నుంచి 30 రోజుల మధ్య నారు ఎక్కువ రోజులు నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నారుమడిలో ఐదు రోజుల లోపు నీరు పూర్తిగా బయటకు తీసి ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. పిలక దశలో వరిపైరు మునిగితే నీరు బయటకు వెళ్లిన తరువాత ఎకరానికి 20 కిలోలు యూరియా, 20 కిలోలు పొటాష్ చల్లుకోవాలని ఆయన తెలిపారు.

పొలాల్లో నిల్వ నీరు బయటకు తోడాలి



కైకలూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల వరిపొలాల్లో ఐదు రోజుల కంటే నీరు నిల్వ ఉంటే రైతులు బయటకు తోడివేయాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు తెలిపారు. వర్షాలకు తడిసిన ఆచవరం, వింజరం, శ్యామలాంబపురం, తామరకొల్లు గ్రామాల్లో వరి పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ రైతులతో మాట్లాడుతూ పొలాల్లో నీరు బయటకు తీసిన వెంటనే పైపాటుగా 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును బూస్టర్ డోస్‌గా వేసుకోవాలన్నారు. పైరు కోలుకున్న తర్వాత తెగుళ్లు ఉంటే ఒక గ్రాము కార్బండిజం లేదా మాంకోజెబ్ మిశ్రమాన్ని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ఆర్.దివ్య ఉన్నారు.

వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం



కైకలూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎడతెరపిలేని వర్షాలతో జనజీవనం స్తంభించింది. కైకలూరులో పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో వర్షపు నీరు శనివారం చేరింది. గుంతల కారణంగా పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారినపడ్డారు. కైకలూరులో వెలంపేట, టౌన్‌హాలు, రైల్వేస్టేషన్ రోడ్, హైస్కూల్ ఎదుట రోడ్, ఎన్జీవోస్ కాలనీల లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఈదురు గాలులకు బొమ్మినంపాడు, కోమర్రు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. కైకలూరు నియోజకవర్గంలో 36.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కలిదిండి మండలం ఉప్పుటేరులో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు తెలిపారు.

పొంగుతున్న డ్రెయిన్లు

వివిధ డ్రెయిన్ల నుంచి చేరే నీటిని కొల్లేరుకు పంపించడానికి ఏకైక మార్గమైన మండవల్లి మండలం పెద ఎడ్లగాడి వంతెన వద్ద నీటిమట్టం పెరుగుతోంది. ఇక్కడ వర్షాలు తగ్గిన తర్వాత ఎగువ నీరు చేరడంతో సమీప గ్రామాలు ముంపుబారిన పడతాయి. ప్రస్తుతం పెదఎడ్లగాడి వద్ద ఎలాంటి ప్రమాదం లేదని డ్రెయినేజీ ఏఈఈ ఇందిర చెప్పారు. ఇదిలా ఉంటే నియోజకవర్గంలో పెదకొమ్ములేరు, లాల్వ, చిన కొమ్ములేరు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి.

నారుమడులు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అవురుపూడి(మొవ్వ): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మొవ్వ మండలంలోని సుమారు 100 ఎకరాలకు పైగా వరి నారుమడులు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ డిమాండ్ చేశారు. మొవ్వ మండలం అవురుపూడి గ్రామంలో నీట మునిగిన నారుమడులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భారీ వర్షాలకు నీట మునిగిన నారుమడులు మరో నాలుగు రోజులు నీట మునిగి ఉంటే నారుమడులు పనికి రాకుండా పోతాయన్నారు. మంత్రిపాలెం నుంచి కాజ వెళ్లే మురుగు డ్రెయిన్ గుర్రపు డెక్క, తూటు కూర నాచు మేట వేసుకుపోయిందన్నారు. 90 శాతం పైగా వ్యవసాయం కౌలు రైతులు చేస్తున్న నేపథ్యంలో నారుమడులు నష్టపోయిన రైతులకు వివరాలను అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కోరారు. అలాగే ఆర్‌బీకేల ద్వారా ఉచితంగా విత్తనాలను ఇవ్వాలన్నారు. కౌలు రైతు సంఘం నాయకులు కొడాలి కరుణాకర్ రావు, రైతులు వేణుబాబు, శ్రీనివాసరావు, రాము పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ

కోళ్ల వ్యర్థాలతో చేపల సాగు చేసేవారిపై చర్యలు తీసుకోవాలి

కైకలూరు: ఫంగస్ చేపల సాగులో కొందరు కోడి వ్యర్థ పదార్థాలతో పెంపకం చేయడం వల్ల మొత్తం ఆక్వా రంగానికే చెడ్డ పేరు వస్తోందని తక్షణం వ్యర్థాలను అరికట్టాలని చేపల రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నంబూరి వెంకట్రామరాజు(తాడినాడ బాబు) కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. ఏలూరు జిల్లాలో వ్యర్థ పదార్థాలతో ఫంగస్ రకం చేపల సాగు పెదవేగి, ఉంగుటూరు ప్రాంతాల్లో సాగుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీఓను కచ్చితంగా అమలు చేయిస్తామని చెప్పారు. ఆక్వా రైతులు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రవి, పేరిచర్ల ప్రసాదరాజు, కొల్లి బాబీ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కామినేనికి వినతిపత్రం అందజేస్తున్న తాడినాడ బాబు